www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 15 నవంబర్ 2024
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



వర్గీకరణకు ముందే కులగణన చేపట్టాలి

ప్రజాశక్తి - మలికిపురం

రాష్ట్రంలో ముందు కులగణన చేపట్టాలని, ఆ తర్వాతే వర్గీకరణపై కమిషన్ వేయాలని మాలల న్యాయ పోరాట సమితి జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. మలికిపురం పూలే అంబేద్కర్ సామాజిక భవనంలో గురువారం నాలుగు మండలాల జెఎసి కన్వీనర్ చింతా రాజబాబు అధ్యక్షతన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన జరగాలంటూ పెద్దయెత్తున నినాదాలు చేశారు. మాలలందరూ సమైక్య ఉద్యమాలకు సంసిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమయ్యిందన్నారు. నవంబర్ 18న కలక్టర్‌కు వినతిపత్రం అందిందచందుకు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బత్తుల మురళీకృష్ణ, గెడ్డం ఫిలిప్ రాజు, తోటే ప్రతాప్, తోటే రాజేష్, గెడ్డం తులసీభాస్కర్, నల్లి శివకుమార్, సరెళ్ల విజయప్రసాద్, చిలకపాటి శ్రీధర్, తాడి సహదేవ్, మట్టా ఏడుకొండలు, కలిగితి ఏసురత్నం, ఈద రవిరెడ్డి పాల్గొన్నారు.

ధరలు, విద్యుత్ భారాలు తగ్గించండి

ప్రజాశక్తి-అమలాపురం

నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయని, ధరల అదుపునకు అన్ని చర్యలూ తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం ప్రజాపోరు ముగింపు సందర్భంగా స్థానిక కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆమె మాట్లాడారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరసమైన ధరలకు అందించాలని సూచించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్న యువత నిరాశకు గురవుతోందని, డిఎస్‌సి వాయిదా పడిందనీ గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించలేదని, గ్రూప్-1, గ్రూప్-2 అగమ్యగోచరంగానే ఉన్నాయని, కోచింగ్ తీసుకున్న యువత అయోమయంలో ఉందని చెప్పారు. వెంటనే రిక్రూట్‌మెంట్ ప్రారంభించి ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇసుక, మద్యం, విద్యుత్ ఛార్జీలు పెరిగిపోయాయని, మహిళలు, దళితులపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వానికి భిన్నమైన పాలన అందిస్తామన్న కూటమి ప్రభుత్వం వాగ్దానాలు అమల్లోకి రాలేదని, అవినీతి విచ్చలవిడిగా సాగుతోందని, ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నాయని చెప్పారు. ఉచిత ఇసుక విధానం నేటికీ అమల్లోకి రాలేదనీ, భవన నిర్మాణ కార్మికులు, రవాణా వాహన యజమానులు, కార్మికులు, ర్యాంపల్లో కార్మికులు, నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం షాపుల సమయాలు పెంచడం, బెల్టుషాపులకు తెరదీయడం అన్యాయం అన్నారు. జిల్లా నాయకులు కె.కృష్ణవేణి మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూనే ట్రూఅప్ ఛార్జీల పేరుతో రూ.20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. పార్టీ నాయకులు నూకల బలరాం మాట్లాడుతూ ఇప్పటికీ పెద్ద సంఖ్యలో వరద బాధితులకు సహాయం అందలేదని, అందింది కూడా అరకొర మాత్రమే అన్నారు. ఎన్యుమరేషన్‌లో అక్రమాలు జరిగాయని, కౌలురైతులకు తీరని అన్యాయం జరిగిందని, వెంటనే సమగ్ర సర్వే చేసి వాస్తవ సాగుదారులు అందరికీ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ సహా అన్ని ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని, గత ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం చేసిన వాగ్దానాలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకురాలు నాగ వరలక్ష్మి మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో దళితులు, శ్మశాన, ఇతర సమస్యలు ఎదుర్కొంటున్నారని, మెడికల్ కాలేజీలను పిపిపి పేరుతో ప్రయివేటు పరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ప్రైవేటీకరణ వల్ల వైద్య సేవలు సామాన్య ప్రజలకు దూరం, భారం అవుతాయని తెలిపారు. అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పీతల రామచంద్రరావు విత్తనాల రాంబాబు, ముడే చినసత్యనారాయణ, పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, టి.లవరాజు, తాడి శ్రీరామ్మూర్తి, కె.గోపాలం, బి.సత్యనారాయణ, గంజా సత్తిబాబు, వాకపల్లి సురేష్, పొలమూరి శ్రీనివాస్, అయితాబత్తుల రమేష్, పచ్చిమాల నాగమణి, వంగలపూడి మంగమ్మ, తొత్తరమూడి సీత తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు


డిఆర్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

రబీకి పూర్తిస్థాయిలో సాగునీటి సరఫరా

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలోని మొత్తం ఆయకట్టు విస్తీర్ణం 2,71,658 ఎకరాలకు 2024- 25 రబీ సీజన్లో పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా చేసేందుకు జిల్లాస్థాయి సలహా సంఘం నిర్ణయించిందని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా నీటిపారుదల సలహా సంఘ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానించారు. గోదావరి నదిలో పుష్కలంగా సాగు నీటి నిల్వలు ఉన్నాయని జల వనరుల శాఖ కార్య నిర్వహక ఇంజనీర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో తక్కువ కాలపరిమితి కలిగిన వంగడాల సాగును ప్రోత్సహిస్తూ వీలైనంత తక్కువ కాలవ్యవధిలో వరి నాట్లు పూర్తి చేసి కోతలు కూడా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సాగునీటి కేటాయింపులు, సక్రమంగా జరుపుతూ జిల్లాకు రావలసిన నీటిని సమృద్ధిగా వినియోగించాలన్నారు. సాగునీటి విడుదలలో వివక్షకు తావు లేకుండా సాగునీటి వినియోగాన్ని గరిష్టతరం చేస్తూ ఆయకట్టు రైతులందరికీ పూర్తిస్థాయిలో సాగునీటిని సమృద్ధిగా అందించి కాలువ చెట్టు చివరి భూముల వరకు ఏ ఒక్క ఎకరానికీ సాగునీటి కొరత సమస్య ఉత్పన్నం కాకుండా జల వనరుల శాఖ ఇంజనీర్లు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కాలువల చిట్టచివరి ఆయకట్టుకు సాగు నీటి సమస్యలు ఉత్పన్నమైన సందర్భంలో డ్రైన్లలో 6 క్రాస్ బండ్లు వేయడానికి ప్రతిపాదించామన్నారు. ఫిబ్రవరి నుంచి సాగునీటి సమస్యలు ఉత్పన్నమైన సందర్భంలో వారబందీ విధానాన్ని అమలు చేయాలన్నారు. సాంప్రదాయ నీటిపారుదల పద్ధతులు వ్యవసాయానికి మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తాయని సాగునీటి వినియోగ సామర్థ్యాన్ని గరిష్టతరం చేసి సాగునీటి వృథాను తగ్గిస్తూ అవే నీటి వనరులతో మరింత విస్తీర్ణంలో పంటల సాగును చేపట్టేలా ప్రోత్సహించి అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ యాంత్రీకరణ సాగునీటి యాజమాన్యం, శాస్త్రీయ పరిశోధనల ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నారు. ఉత్పాదకతను పెంచడం ద్వారా ఖర్చును ఆదా చేయాలన్నారు. స్వర్ణాంధ్ర-2047 సాధన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో నీటిపారుదల విభాగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో అత్యవసరంగా చేపట్టాల్సిన 114 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసుబాబు, డ్రైనేజీ విభాగం డిఇ ఎంవిఎస్.కిషోర్, జల వనరుల శాఖ డిఇ నాగేంద్ర కుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జెసి

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలపై వినతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

అంగన్వాడీ సెంటర్లలో సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర నాయకుల పిలుపుమేరకు అంగన్వాడీ వర్కర్లు ఐసిడిఎస్ అధికారులకు గురువారం వినతిపత్రం అందజేశారు. నవంబర్ 14 జాతీయ బాలల దినోత్సవ సందర్భంగా ప్రి స్కూల్స్‌ను బలోపేతం చేయాలని, పిల్లలకు సాయంత్రం స్నాక్స్ ఇవ్వాలని, ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలని, పక్కా భవనాలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌లో చేరాలని ప్రచారం నిర్వహించాలని, యూనిఫామ్ ఇవ్వాలని కోరారు. ఎం.దుర్గమ్మ, నాయకులు చంద్రకళ, వెంకటరత్నం, సూర్య కుమారి, రత్నం, దుర్గ, జహీరా పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

పిడిఎఫ్ అభ్యర్థి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

టీచర్స్ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపి మూర్తి గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని అంగర, మాచర, టేకి, కపిలేశ్వరపురం, వాకతిప్ప పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులను కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వాకతిప్పలో ప్రచారం చేస్తున్న గోపి మూర్తి


వైఎస్.షర్మిళతో గోపాలకృష్ణంరాజు

వైఎస్.షర్మిళతో రుద్రరాజు భేటీ

ప్రజాశక్తి - మలికిపురం

ఎపి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిళరెడ్డిని పిసిసి సభ్యులు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు గురువారం విజయవాడ ఆంధ్ర రతన్ భవనంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంధ్భంగా రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులను ఆమె అడిగి తెలుసుకున్నారని, రాబోయే రోజులలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుండి బలోపేతం చేయవలసిన అవసరం ఉందని షర్మిల అన్నారని రాజు తెలిపారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 7 అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్లను త్వరలో నియమిస్తున్నట్లు షర్మిల రెడ్డి తెలిపారని గోపాలకష్ణరాజు అన్నారు.

న్యాయం చేయాలని వినతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

104 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కుసుమ ఓం ప్రకాష్ ఆరోపించారు. ఈ మేరకు ఓం ప్రకాష్ నిరసన వ్యక్తం చేస్తూ విలసవిల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి గురువారం వినతిపత్రం అందజేశారు. 104 వ్యవస్థను నేరుగా పిహెచ్‌సిల ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలని జిఒ నెం.7 వర్తింపజేయాలని, ప్రతినెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని ప్రకాష్ డిమాండ్ చేశారు.

చేనేత కార్మికుల లబ్ధిని విడుదల చేయాలి

ప్రజాశక్తి-అయినవిల్లి

చేనేత కార్మికులకు ఆర్థిక చేయూత అందించేందుకు కేంద్రప్రభుత్వం జాతీయ చేనేత అభివృద్ధి పథకం ద్వారా అమలు చేస్తున్న 'హత్ ఖార్గ్ సంవర్ధక సహాయక్'లో భాగంగా ఎంపికైన 42 మంది చేనేత కార్మికుల ఆర్థిక లబ్ధిని తక్షణమే విడుదల చేయాలని మాజీ జెడ్‌పిటిసి గంగుమళ్ల కాశీ అన్నపూర్ణ శ్రీనివాస్ నేతత్వంలో ఎంపీ గంటి హరీష్ మాధుర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక లబ్ధికి సంబంధించిన పూర్తి వివరాలు అందజేసి, సమస్య తీవ్రతను తెలిపారు. ఆర్థిక ప్రయోజనం ద్వారా వ్యక్తిగత వర్క్ షెడ్లు (మగ్గాలు) నిర్మాణం చేసుకుని చేనేత కార్మికులు జీవనోపాధిని మెరుగు పరుచుకోవడానికి సహకరించాలని కోరారు. మండలంలోని 110 మంది చేనేత పనివారు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోగా, రాష్ట్ర స్థాయిలో వివిధ ప్రామాణికాల ఆధారంగా, గ్రామాలు వారీగా 42 మందిని అర్హులుగా గుర్తించారని తెలిపారు. దీనిపై ఎంపీ హరీష్ మాధుర్ స్పందిస్తూ, న్యూఢిల్లీలోని చేనేత కమిషనర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు అంకం వీర్రాజు, గంగుమళ్ల శ్రీనివాస్ సొసైటీ సభ్యులు ఉన్నారు.


ఎంపీ హరీష్‌కు వినతిపత్రం అందిస్తున్న చేనేత సొసైటీ సభ్యులు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జెడి నాగమణి

హైస్కూల్‌ను సందర్శించిన ఆర్‌జెడి

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని హసన్‌బాద హైస్కూల్‌ను విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి గురువారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ఆమె మాట్లాడారు. విద్య ప్రాముఖ్యత మానవ జీవనశైలి విధానంలో, ఉద్యోగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు లభించే ప్రాధాన్యతను వివరించారు. అనంతరం హెచ్‌ఎం పిఎస్‌బిఎస్‌కె.సుందరి, ఇతర ఉపాధ్యాయులతో మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు వెనుకబడిన విద్యార్థులను గుర్తించడం వంటి వాటిపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. బాలల దినోత్సవం సందర్భంగా హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఇసుక రీచ్‌లలో తవ్వకాలు ప్రారంభించాలి

ప్రజాశక్తి-అమలాపురం

ఈ నెల 16 నుంచి జిల్లాలోని 12 ఇసుక రీచ్‌లలో ఇసుక తవ్వకాలు ప్రారంభించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా గనులు భూగర్భ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టా, అసైన్డ్ భూముల్లో ఇసుక మేటలు తొలగింపు కోసం ముందుగా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంటే వారి అభ్యర్థనపై క్షేత్ర స్థాయిలో జల వనరులు, వ్యవసాయం రెవెన్యూ తదితర శాఖల ద్వారా సంయుక్త తనిఖీని ఆయా భూముల్లో నిర్వహించి మ్యాపులతో సహా నివేదిక సమర్పిస్తారని తెలిపారు. ఆ నివేదికను జిల్లాస్థాయి ఇసుక కమిటీకి పంపి అనుమతులు పొందాలన్నారు. ఆ రైతుల లిఖిత పూర్వక అంగీకారంతో తవ్వకాలు మూడు కేటగిరీల్లో చేపడతామన్నారు. త్వరలో నిర్వహించబోయే జిల్లా కమిటీలో ఈ నివేదికలను పరిశీలించి ఆమోదం పొందిన తరువాత గనులు, కాలుష్య నియంత్రణ అనుమతులు పొందిన అనంతరం ఇసుక త్రవ్వకాలు చేపడతారన్నారు. తవ్వకాల కోసం నిర్దేశించిన షరతులకు అనుగుణంగా ఎంపిక చేసిన ఏజెన్సీలకు మాత్రమే ఇసుక తీసే వెసులుబాటు ఉందని తెలిపారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటలకు ఇసుక త్రవ్వకాలు ఏజెన్సీలు నిర్వహించాలన్నారు. సిసి టివి మానిటరింగ్ సిస్టంతో పాటుగా రవాణా పర్యవేక్షణకు పోలీస్ కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానిస్తూ సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి ఎల్.వంశీధర్ రెడ్డి, ఆర్‌డిఒలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల, కాశీ విశ్వేశ్వర రావు, డి.శ్రీనివాస రావు, టి.సుజాత, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం


నగర పంచాయతీ అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించి మెరుగైన సేవలు అందించాలని నగర పంచాయతీ కమిషనర్ రవివర్మ సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం కౌన్సిల్ హాల్లో గురువారం అధికారులు, సిబ్బందితో రివ్యూ సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. ఉద్యోగులు విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని, సమయపాలన పాటించాలని, ఫీల్డ్ వర్క్‌కు వెళ్లే ఉద్యోగులు మూమెంట్ రిజిష్టర్ తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. హౌస్ హోల్డ్ సర్వే జియో ట్యాగింగ్‌ను సచివాలయం సిబ్బంది నిర్వహిస్తున్నారని, దీనికి నగర వాసులు సహకరించాలని, నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లింక్‌ను బ్యాంక్ అకౌంట్‌కు అనుసంధానించుకోవల్సిన జాబితాను సచివాలయ సిబ్బంది సంబంధిత ఖాతాదారుల ఫోన్ నెంబర్‌కు సమాచారం ఇస్తామన్నారు. వీటిని నిర్ణీత సమయంలో చేయించుకుని సిబ్బందికి సహకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నూకరాజు ఎఇ సుధాకర్, ఆర్‌ఐ భాస్కరరావు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం, ఆత్రేయపురం

కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ పి.రత్నకుమారి అధ్యక్షతన జరిగిన శిక్షణ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ, వైద్యాధికారులు, వ్యవసాయ శాఖ అధికారి, పంచాయతీ కార్యదర్శులకు, గ్రామపంచాయతీ అభివృద్ధి చేయవలసిన ప్రణాళికను ఎంపిడిఒ రత్నకుమారి వివరించారు.

ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయితీల అభివృద్ధి ప్రణాళిక, బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమాన్ని ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట్ రామన్ నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ సిబ్బందికి గ్రామ పంచాయితీ నిధులు సమర్థవంతంగా వినిగించుకోవాలని, గ్రామ పంచాయితీల్లో అభివృద్ధి ప్రణాళికను రూపొందించడం ద్వారానే గ్రామాభివృద్ధి సాదించవచ్చని తెలిపారు. ప్రణాళిక రూపొందించడానికి గ్రామంలో ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించి ప్రజలను భాగస్వామ్యులను చేయాలని తెలిపారు. 2025-26 గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక సమర్థవంతంగా రూపొందించడంలో ఈ శిక్షణా కార్యక్రమం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి యు.చంద్ర శేఖర్, అధికారులు వై.శ్రీధర్, డి.గంగాధర్, కె.విజయ భారతి, కె.పద్మావతి, పివివి.సుబ్బారావు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో శిక్షణ ఇస్తున్న ఎంపిడిఒ



కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ పి.రత్నకుమారి



బీమా చెక్ అందచేస్తున్న ఎస్‌బిఐ ఆర్‌ఎం కృష్ణ

ఖాతాదారుని కుటుంబానికి బీమా అందజేత

ప్రజాశక్తి-అమలాపురం

ముక్తేశ్వరం భారతీయ స్టేట్ బ్యాంకులో సేవింగ్ అకౌంట్ కలిగిన అజ్జరపు సత్యనారాయణ ఆకస్మిక మరణం చెందడంతో ఆయన భార్య అజ్జరపు రత్నంకు రూ.రెండు లక్షల పిఎం జీవన్ జ్యోతి బీమా యోజన చెక్‌ను గురువారం అమలాపురం స్టేట్ బ్యాంక్ రీజినల్ కార్యాలయంలో ఆర్‌ఎం ఎంవివిఎమ్ కృష్ణ అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనకు స్టేట్ బ్యాంకు ఖాతాదారుడు ప్రతి ఏడాదీ రూ.436 కట్టాలని అప్పుడు పాలసీ రెన్యూవల్ అవుతూ వస్తుందని తెలిపారు. ఇలా డబ్బులు కట్టి పాలసీ తీసుకున్న ఖాతాదారుడు ఏ కారణంవల్ల అయినా మరణిస్తే జీవిత బీమా క్రింద రూ.2 లక్షలు ఆ కుటుంబ సభ్యులు, లేదంటే నామినీకి అందజేస్తారని తెలిపారు. ఈ పథకం 18 నుండి 50 ఏళ్ల వయసులో ఖాతాదారులుగా ఉన్న వ్యక్తులందరూ చేరడానికి అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో ముక్తేశ్వరం బ్రాంచ్ మేనేజర్ కెవి.దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణపై ఉద్యమం తీవ్రతరం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రాజ్యాంగ విరుద్ధమైన ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాటాన్ని తీవ్రతరం చేసేందుకు మాలలంతా మరో ఉద్యమానికి సన్నద్ధం కావాలని ముమ్మిడివరం నియోజకవర్గ మాలమహానాడు పిలుపునిచ్చింది. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం అవరణలోని అంబేద్కర్ కన్వెన్షన్ హాల్లో గురువారం నియోజకవర్గ స్థాయి మాలల రౌండ్ టేబుల్ సమావేశం బడుగు జేమ్స్ పాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలను అణచివేసే ధోరణిలో రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణకు మద్దతు తెలుపుతున్నాయని, వీటిని సమర్థవంతంగా తిప్పి కొట్టేందుకు మాల మహానాడు, మాల ఉద్యోగుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, మాల మేధావులు సంయుక్త కార్యాచరణను సిద్ధం చేసి ఐక్య పోరాటానికి నియోజకవర్గ స్థాయి భారీ బహిరంగ సభను నిర్వహించాలని రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కాట్రేనికోన

విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోకా రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు కాట్రేనికోన మండల పరిధిలో, చెయ్యేరు సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులందరూ గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కార్టూన్ 'నిజం'



నేరాలు ఘోరాలు

రైలు పట్టాలపై మహిళ మృతదేహం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

చేబ్రోలు రైల్వే ట్రాక్‌పై గొల్లప్రోలుకు చెందిన వివాహిత అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. పట్టణ పరిధిలోని కరణం గారి తోటలో నివాసం ఉంటున్న తొగరు దివ్య(26) గురువారం తెల్లవారుజామున చేబ్రోలు సమీపంలో రైల్వే ట్రాక్‌పై అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె భర్త తొగరు రమేష్ ఎర్రవరం గ్రామంలో అవంతి ప్రో ఫుడ్స్‌లో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఆమెకు మూడేళ్ల క్రితం వివాహం అయింది. సామర్లకోట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలోని తూర్పు గోనగూడెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. రాజానగరం ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకు నౌకాదళానికి చెందిన సామగ్రిని వాహనంలో తీసుకుని వెళుతున్నారు. జాతీయ రహదారి ఐఎస్‌టిఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల సమీపానికి చేరుకునే సరికి హైదరాబాద్ నుంచి విశాఖ వెలుతున్న తుఫాన్ జీప్ నౌకాదళం వాహనం వెనుక వేగంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో జీపులో ప్రయాణిస్తున్న ఆశీష్ కుమార్ త్రిపాఠి(32), షేక్ షాబ్జీ (30) అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేశారు. మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వీరభద్రుడి సంబరంలో మహిళ మృతి

ప్రజాశక్తి - కరప

మండలం గురజానపల్లి శివారు అడివిపూడి గ్రామంలో వీరభద్రుని సంబరంలో ఒక మహిళ ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోయి మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలను ఎస్ఐ టి.సునీత వెల్లడించారు. అడివిపూడికి చెందిన గెద్దాడ సత్యవతి తన భర్త సత్యనారాయణతో కలిసి గ్రామంలో జరుగు వీరభద్రుడు సంబరానికి వెళ్లింది. సంబరంలో సత్యవతి ఊగిపోతూ కడుపులో మంట వస్తుందని భర్తకు చెప్పింది. దీంతో స్థానికులకు ఆమెకు నీళ్లి తాగించారు. వెంటనే ఆమె స్పృహ కోల్పోయింది. ఆమెను చికిత్స నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతిరాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

15 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మరలావ గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో 15 అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి- కడియం

కడియం భాస్కర నగర్ ప్రాంతంలో రహదారి చెంతన విద్యుత్ స్తంభం విరిగి ప్రమాదకరంగా మారింది. ఈ స్తంభంపై 11కెవి విద్యుత్ లైను, అలాగే ఎల్‌టి లైన్‌తో పాటుగా 16 కెవి ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. నెల రోజుల క్రితం నర్సరీ మొక్కల లారీ స్తంభాన్ని ఢీ కొట్టిందని స్థానికులు తెలిపారు. అప్పట్లోనే విద్యుత్ సిబ్బంది లారీ డ్రైవర్ నుంచినష్టపరిహారంగా రూ.15 వేలు వసూలు చేశారన్నారు. కాని మరమ్మతులు మాత్రం చేయలేదన్నారు. ప్రతి రోజూ ఈ రహదారి గుండా అధిక సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు, మొక్కలు లారీలు, అలాగే స్థానిక ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెను ప్రమాదం సంభవించి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా ఉన్నతాధికారులు స్పందించాలని, తక్షణం సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అసంక్రమిత వ్యాధులపై సర్వే

ప్రజాశక్తి - చాగల్లు

బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రతి గ్రామంలో ఈ నెల 14 నుంచి అసంక్రమిత వ్యాధులపై ఇంటింటా సర్వే జరుగు తుందని వైద్యాధికారి డాక్టర్ కె.నిషిత తెలిపారు. ఈ సర్వేలో భాగంగా ప్రతి కుటుంబాన్ని ఆరోగ్య సిబ్బంది సందర్శించి ఇంటిలోని 30 ఏళ్లుపైబడిన ప్రతి ఒక్కరికి మధుమేహం, రక్తపోటుపరీక్షలు నిర్వహిస్తారన్నారు. 18ఏళ్ల పైబడిన వారికి కేన్సర్ పరిక్షలు చేస్తారన్నారు. దీనికి ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పిఆర్ఎల్.దేవి, ఎ.రామచంద్రరావు సూపర్ వైజర్ పి.రేవతి, నరసమ్మ, ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

అన్నదాన నిధికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి-అయినవిల్లి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయాన్ని రావులపాలెం వాస్తవ్యులు పడాల సూర్య వెంకట సత్యనారాయణ రెడ్డి సరిత దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వర స్వామి నిత్యాన్నదాన నిధికి రూ.10 వేలు విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒ సతీష్ రాజు తెలిపారు.

సత్యనారాయణ మృతికి సంతాపం

ప్రజాశక్తి-మామిడికుదురు

పాశర్లపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ చైర్మన్ యువివి.సత్యనారాయణ కుటుంబ సభ్యులను డిసిసి అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు గురువారం పరామర్శించారు. యువివి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అక్రమ ఇసుక తవ్వకాలపై నిఘా

ప్రజాశక్తి-రామచంద్రపురం

క.గంగవరం మండలంలోని పాతకోట గ్రామం వద్ద అక్రమంగా ఇసుక తరలిపోతున్న అందిన ఫిర్యాదు మేరకు తహశీల్దారు మృత్యుంజయరావు గురువారం గోదావరి ఇసుక ర్యాంపు ప్రాంతాన్ని సందర్శించారు. ప్రస్తుతం అక్కడ తవ్వకాలు జరగడం లేదని ఇకనుంచి ఎటువంటి అక్రమ తవ్వకాలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇసుక ర్యాంపులు ఉన్న ప్రాంతంలో రెవెన్యూ సిబ్బందిని నిఘా పెట్టామన్నారు. నిబంధనలు అతిక్రమించి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతికి నిజమైన సంపద బాలలే

జాతికి నిజమైన సంపద బాలలే అని పలువురు వక్తలు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా తొలి ప్రధాన నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం శాఖా గ్రంథాలయంలో ఉప విద్యాశాఖ అధికారి సూర్య ప్రకాశం, హెచ్ఎం బిఆర్.కామేశ్వరావు పాల్గొన్నారు. జి.సూర్య ప్రకాశం గ్రంథాలయ వారోత్సవాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి జి.వర్మ, సిబ్బంది, పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, ఆకుల భవాని పాల్గొన్నారు.

ఆలమూరు మండలంలోని మడికి, చెముడులంక నేతాజీ స్కూల్లో కరస్పాండెంట్ తుమ్మ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ డే ఘనంగా నిర్వహించారు. వివిధ క్రీడల్లో విజేతలకు పతకాలు అందజేశారుల. ఈ కార్యక్రమంలో కూటమి. నాయకులు దొండపాటి సుబ్బరాజు, నాగిరెడ్డి వెంకటరత్నం నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, ఈదల రమేష్, నాగిరెడ్డి సత్యానందం, కొత్తపల్లి రాంబాబు, లంకలపల్లి ఆంజనేయులు, సిరంగుల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలోని వివేకనంద ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దేశ నాయకుల వేషాధారణల్లో ఆకట్టుకున్నారు. కరెస్పాండెంట్ పివివి.వరప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మలికిపురం శాఖా గ్రంథాలయం వద్ద లైబ్రేరియన్ నాగేంద్ర ఆధ్వర్యంలో ఎంఇఒ సత్యనారాయణ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రామచంద్రపురంలో దినోత్సవంలో పాల్గొన్న బాలలు



ఆలమూరులో విజేతలైన విద్యార్థులతో కరస్పాండెంట్ శ్రీనివాసరావు

ఉప్పలగుప్తం గొల్లవిల్లి విజ్‌డమ్ పబ్లిక్ స్కూల్లో మాజీ సర్పంచ్ గుత్తాల సుభాష్ చంద్రరావు అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రులతో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ పండు బాలకృష్ణ, ప్రిన్సిపల్ దేవరపల్లి రాంబాబు, హెచ్ఎం డి.దుర్గ గ్రామ పెద్దలు పాల్గొన్నారు. భీమనపల్లి శాఖా గ్రంధాలయాల్లో అధికారులు సలాది నాగేశ్వరరావు, నిమ్మకాయల శేషు కుమార్, ఎంఇఒ సత్తి సత్య కృష్ణ, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నల్లా నరసింహమూర్తి పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో లేబ్రేరియన్ డి.శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇఒ కె.తాతారావు, జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం వంగా శ్రీనివాస్ మాట్లాడారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపులో బహుమతులు, ప్రశంసా పత్రములు అందజేస్తామని తెలిపారు. అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు. వివేకానంద ప్రిన్సిపల్ చిట్టూరి నాగేంద్ర ప్రసాద్, సచివాలయ సోషల్ వెల్ఫేర్ ఎస్.సతీష్, రిటైర్డ్ ఉపాధ్యాయులు చిట్టూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

అల్లవరం గంథాలయం ఎజిఎస్.ప్రకాశరావు మాట్లాడారు. ఉపాధ్యాలు జి.స్వామి శ్రీనివాస్, కె.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్ ఈదరపల్లి ఆర్ఆర్ నగర్ ఎంపిపి పాఠశాలలో గురువారం బాలల దినోతవాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం ఎం.కోటేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాలలోని చిన్నారులకు గేమ్స్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కపిలేశ్వరపురం కపిలేశ్వరపురం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం వై.కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ మాట్లాడారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. సిఆర్‌పి సరిత, ఉపాధ్యాయునులు వీరవేణి, ప్రమీల పాల్గొన్నారు.

ఆత్రేయపురం ఎంపిడిఒ బికెఎస్-ఎస్‌వి.రామన్ గ్రంథాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి నెహ్రూ, అయ్యంకి వెంకటరమణయ్య, అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి బాలల దినోత్సవాన్ని ప్రారంభించారు. ఎంఇఒ వరప్రసాద రావు మాట్లాడారు. టి.నమశ్శివాయ, ఉపాధ్యాయులు విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

రామచంద్రపురం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ దడాల వెంకటరమణ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పలు పాఠశాలల హెచ్ఎంలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీరామచంద్రమూర్తి, ఈశ్వర్, ఆంజనేయులు, రాజేంద్ర, మణికుమార్, రవిచంద్ర, శ్రీనివాసులు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వనజాక్షి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో ఏడు పాఠశాలల నుండి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడికుదురు నగరంలో డిసిసి అధ్యక్షుడు, మాజీ ఎంఎల్‌ఎ చిట్టిబాబు ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పిల్లలకు బాలలదినోత్సవ శుభాకాంక్షలు తెలియచేసి స్వీట్స్ పంచారు ఈ కార్యక్రమంలో అప్పన శ్రీరామకృష్ణ, బొంతు రాజేంద్రప్రసాద్, గెద్దం వెంకటేశ్వరరావు, తవిటికి వెంకన్నబాబు, జాలెం నాగరాజు, కొండేటి వెంకటేశ్వరరావు, బల్ల కీర్తి రైనా, కొండేటి స్టాలిన్, విత్తనాల వెంకటరమణ, కాలేపు శ్యామ్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బి.హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. బాల బాలికలకు రాజ్యాంగం ప్రత్యేక హక్కులను కల్పించిందని, వాటి పరిరక్షణకు ప్రభుత్వాలు, పౌరులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం 14 ఏళ్ల లోపు బాల బాలికలంతా పాఠశాలల్లోనే ఉండాలని, వారిని పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా నేరమని, చట్ట ఉల్లంఘనకు పాల్పడిన వారికి కఠినంగా శిక్షిస్తామని వివరించారు. తొలుత జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, ఎస్ఐ డి.జ్వాలా సాగర్ పాల్గొన్నారు.

రావులపాలెం పొడగట్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో బాలల దినోత్సవం సూపర్ వైజర్ నాగసత్యవేణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లులు, అంగన్వాడీ కార్యకర్తలు,ఆయాలు,డే స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. పొడగట్లపల్లి ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వంశీ కృష్ణ అధ్యక్షతన జరిగిన బాలల దినోత్సవంలో ఎస్ఎంసి చైర్మన్ జాలాది సహదేవుడు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తంలో విజ్‌డమ్ స్కూల్లో విద్యార్థులు



మామిడికుదురులో దినోత్సవంలో పాల్గొన్న చిట్టిబాబు

యానాం వార్తలు



స్విమ్మింగ్ పూల్ శుభ్రం చేస్తున్న సిబ్బంది

స్విమ్మింగ్ పూల్‌కు మరమ్మతులు

ప్రజాశకక్తి - యానాం

యానాంలోని జిఎంసి.బాలయోగి క్రీడా ప్రాంగణంలోని స్విమ్మింగ్ పూల్ క్లీనింగ్, మరమ్మతు పనులు ప్రారంభం అయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా స్విమ్మింగ్ పూల్‌ను క్లీనింగ్ చేయలేదు. ఈ నేపథ్యంలో ప్రజా పనులశాఖ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్ క్లీనింగ్‌తోపాటు, ఇతర మరమ్మతు పనులను చేపట్టారు. స్విమ్మింగ్ పూల్‌ను ఇప్పటి వరకూ శిక్షణకే వినియోగించేవారని, ఇకపై పోటీలు నిర్వహించడానికి అనువుగా తీర్చిదిద్దనున్నట్లు క్రీడా ప్రాంగణం ఇన్‌ఛార్జ్, పిఇటి ప్రకాష్(స్వామి), శాయ్ ఇన్‌ఛార్జ్ ఉదయ్ తెలిపారు.

దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి రాష్ట్ర ట్రేడర్స్ ఫెడరేషన్ ఛైర్మన్, ఎంఎల్‌ఎ శివశంకర్‌ను బెదిరించిన దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని యానాం వర్తక సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. పుదుచ్చేరిలో వర్తకులను తరచూ బెదిరిస్తున్న ఒక వ్యక్తిపై వర్తకులకు మద్దతుగా శివశంకర్ ఫిర్యాదు చేశారని అన్నారు. శివశంకర్ ను బెదిరించన ఘటనకు నిరసనగా ఈనెల 11న పుదుచ్చేరిలోని ఉన్న ఆయా వర్తక సంఘాలు, వ్యాపారస్తులందరూ ధర్నాచేసి, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్ నాథన్‌కు వినతిపత్రం సమర్పించారని తెలిపారు. దోషులపై చర్యలు తీసుకోవాలని యానాం వర్తక సంఘం ఆధ్వర్యంలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్, డిఐజీకి విజ్ఞాపనలు పంపడం జరిగిందని తెలిపారు.

వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ ఉద్యోగాలకు గురువారం ఆన్‌లైన్‌ల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, పీడియాట్రిషన్, సర్జియన్, అనేస్తేటిస్ట్ ఉద్యోగాలకు పుదుచ్చేరి నుంచి ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ నిర్వహించి సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఏడి పలాస్‌కుమార్ సన్యాల్, జెఇఒ బేతాళంకుమార్, సూపరింటెండెంట్ ఉందుర్తి శ్రీను పాల్గొన్నారు.

క్రీడాకారిణి లావణ్యకు సత్కారం

ఉప్పలగుప్తం : రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మునిపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల పదో తరగత విద్యార్థిని బల్ల లావణ్య ఎంపికయ్యింది. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో గురువారం లావణ్యను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఎస్ఎంసి చైర్మన్ యాళ్ల కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు లావణ్యకు నగదు ప్రోత్సాహాన్ని అందించారు. క్రీడల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న పాఠశాల పీడీ నూకల సీతాపతి రావును సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు నిమ్మకాయల రాము, హెచ్ఎం యాగా ఏడుకొండలు, యాళ్ల బాబ్జి, నిమ్మకాయల సూర్య ప్రకాష్, నిమ్మకాయల సాయి, యర్రంశెట్టి సుభాష్, నిమ్మకాయల ఆంజనేయులు, నిమ్మకాయల చిన్న, నిమ్మకాయల వీరబాబు, నిమ్మకాయల వీరేంద్ర, యర్రంశెట్టి తాతకాపు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ట్రైనీ ఐఎఎస్‌లు

సఖినేటిపల్లి : అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని గురువారం పలువురు ట్రైనీ ఐఎఎస్‌లు దర్శించుకున్నారు. డిప్యూటీ తమశీల్దారు సిహెచ్.భాస్కర్, ఆర్ఐపి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో 9 మంది ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఆలమూరు : మండలంలోని సంధిపూడిలో సిసి రోడ్డుతో డ్రైన్ నిర్మాణ పనులు గురువారం ప్రారంభించామని సర్పంచ్ తోట భవాని వెంకటేశ్వర్లు తెలిపారు. గత నెలలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు శంకుస్థాపన చేసిన ఈ రహదారికి ఉపాధి నిధులు రూ.20 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఇవి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ వ్యవస్థ ఆధ్వర్యంలో నిర్మాణ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు తోట వెంకటేశ్వర్లు, దొడ్డ సుబ్బారావు, నల్లా వెంకన్న, తోలేటి అంజిబాబు, మోటుపల్లి రాంబాబు, తోరాటి ఆంజనేయులు, మానేపల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పట్టాభి పుట్టిన రోజు

ప్రజాశక్తి- మండపేట

మండపేట పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, వైసిపి సీనియర్ నాయకులు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి పుట్టినరోజును 24వ వార్డ్ కౌన్సిలర్ జొన్నపల్లి విజయలక్ష్మి సత్తిబాబు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు కార్యాలయంలో వైసిపి కార్యకర్తలు, అభిమానుల మధ్య నిర్వహించారు. పుట్టిన రోజు కేక్ కట్ చేసి పంచారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంచారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ పెంకే గంగాధరం, శెట్టి నాగేశ్వరరావు, ముక్కా దాలియా, వై.సత్యం, చల్లా వీర్రాజు, తాడి రామారావు, యరమాటి వెంకన్నబాబు, సాధనాల శివ భగవాన్, బి.అంజి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

యువత చదువుతో పాటు శారీరక దారుఢ్యాన్ని కాపాడుకునేందుకు క్రీడలపై ఆసక్తిని పెంపొందుచుకోవాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ సూచించారు. ఇటీవల ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరిగిన ఇంటర్ కాలేజీ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ముమ్మిడివరం హెల్దీ లైఫ్ జిమ్‌కు చెందిన క్రీడాకారులు అప్పాడి సత్యనారాయణ (పిఆర్ కాలేజీ,కాకినాడ) గోల్డ్ మెడల్, సంసాని నాగ సత్యనారాయణ (ఎస్‌కెబిఆర్ కాలేజీ, అమలాపురం) దొమ్మేటి వేణు మణికంఠ (ఆదిత్య సూరంపాలెం) సిల్వర్ మెడల్ సాధించారు. అండర్ 17 విభాగంలో పాలేపు రమేష్ (డాక్టర్ ఎంజిఆర్ జూనియర్ కాలేజీ, ముమ్మిడివరం) సాగర్ (నారాయణ జూనియర్ కాలేజీ,అమలాపురం) గోల్డ్ మెడల్స్ సాధించారు. అమలాపురం ఎంపి క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎంపి హరీష్ వీరికి మెడల్స్ వేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ వాసంశెట్టి నరేష్, గొలకోటి దొరబాబు, గెడ్డం శ్రీను, దొంగ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీ గంటి హరీష్

ఆకతాయిలతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆలమూరు

బాలికలు, మహిళలు ఆకతాయిలతో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా లైంగిక వేధింపులకు పాల్పడితే వారి కుటుంబ సభ్యులతో పాటు సమీప పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ ఎం.అశోక్ అన్నారు. మండలంలోని బడుగువానిలంక ఎంపియుపి ప్రభుత్వ పాఠశాలలో బాలికా సంరక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ముఖ్యంగా బాలికలు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, ఉన్నతమైన భవిష్యత్తు కోసం బుద్ధిగా చదువుకోవాలని సూచించారు. పాఠశాల ముగిసిన వెంటనే నేరుగా ఇంటికి చేరుకోవాలన్నారు. ఏదైనా పని ఉంటే వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేయాలన్నారు. పోకిరీల నుంచి తమకు తాము రక్షించుకునేందుకు బాలికలు తీసుకునే రక్షణను వివరించారు. ఎవరైనా అల్లరి చేస్తున్నట్లు స్థానికులు గుర్తిస్తే వివరాలు తెలియజేస్తే ఆ ప్రాంతంలో పోలీసు నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. గుడ్, బ్యాడ్ టచ్ లపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా కార్యదర్శి కృష్ణవేణి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అశోక్

సమస్యలు పరిష్కరించాలని 108 సిబ్బంది వినతి

ప్రజాశక్తి-ఆత్రేయపురం, మామిడికుదురు

108 అంబులెన్స్ సర్వీస్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని ఎంపిడిఒకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి తమ సమస్యలు పరిష్కరించడం లేదంటూ ఈ నెల 25 నుండి సమ్మె బాట పట్టనున్నట్లు వారు పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 108 సర్వీస్ఉద్యోగులు మామిడికుదురు తహశీల్దారు గోపాలాచార్యులు, మండల పరిషత్ ఎఒ కారుపల్లి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వమే నేరుగా సర్వీస్‌లు నిర్వహించాలని, స్లాబుల ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఇఎంటి పోస్టుల్లో 108 ఇఎంటిలను నియమించాలని, ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, ప్రమాదాలకు గురైన ఉద్యోగులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను సొంత జిల్లాలకు బదిలీ చేయాలి, 108 సర్వీస్‌లో ఖాళీలు బర్తీ చేయాలని కోరారు. కె.కిరణకుమార్, ఆర్.శ్రీనివాసరావు, కెవివి నరసింహారావు, ఎం.మహేష్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.